సాక్షి
వికారాబాద్

సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



ముక్తి కోసం.. భక్తి పూజలు

బోలేపల్లి జాతర భక్తులతో కిటకిటలాడుతోంది. ఆదివారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. 8లో ▸



అభివృద్ధికి కృషి

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో ▸



మొక్కజొన్న సాగు..

నీటి సౌకర్యం ఉన్న రైతులు యాసంగిలో జొన్న, మొక్కజొన్న సాగువైపే మొగ్గు చూపుతున్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

అనంతగిరి: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 11 గంటల నుంచి పరీక్ష ప్రారంభం కావడంతో విద్యార్థులు గంటముందే సెంటర్ వద్దకు చేరుకున్నారు. విద్యార్థులను తనిఖీ చేసి.. హాల్ టికెట్ పరిశీలించి సిబ్బంది పరీక్షకు అనుమతించారు.

రేపటి నుంచి రామేశ్వరానికి ప్రత్యేక బస్సులు

షాద్‌నగర్‌రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రామేశ్వరానికి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపడం జరుగుతుందని డిపో మేనేజర్ ఉష ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామేశ్వరం జాతర సందర్భంగా ఈ నెల 25 నుంచి 27 వరకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. ఉత్తర రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముగిసిన ఈక్వెస్ట్రియన్ అర్హత పోటీలు



గుర్రాలపై క్రీడాకారుల విన్యాసాలు

శంకర్‌పల్లి: ఈక్వెస్ట్రియన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఎఫ్ఐ) ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మండలం జన్వాడలోని నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్‌లో నిర్వహిస్తున్న నేషనల్ జూనియర్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్ అర్హత పోటీలు ఆదివారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో దేశంలోని పలు క్లబ్‌లకు చెందిన 150కి పైగా హార్స్ రైడింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. హైదరాబాద్‌కి చెందిన ఐజా మీర్ ఢిల్లీలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్ సీఈఓ మీర్ హాఫిజుద్దీన్ మాట్లాడుతూ.. అర్హత పోటీలకు ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఇచ్చిన ఈఎఫ్ఐకి కృతజ్ఞతలు తెలిపారు. నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్ డైరెక్టర్ మీర్ మొయిజుద్దీన్ మహమ్మద్, కంప్రోలర్ మీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శభాష్ పోలీస్




విద్యార్థినిని తమ వాహనంలో వదిలిపెడుతున్న మహేశ్వరం పోలీసులు

మహేశ్వరం: గురుకుల పాఠశాల అర్హత పరీక్ష రాసేందుకు ఓ విద్యార్థిని దారితప్పడంతో పోలీసులు పరీక్ష కేంద్రానికి సకాలంలో తమ వాహనంలో చేర్చారు. గురుకులాల్లో ప్రవేశానికి ప్రభుత్వం ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అర్హత పరీక్ష నిర్వహించింది. ఓ విద్యార్థినికి కందుకూరు మండల పరిధిలోని సమీపంలోని ఎస్ఆర్ఐ కళాశాలలో సెంటర్ కేటాయించారు. ఆమె తల్లితో కలిసి పరీక్ష కేంద్రానికి వస్తూ అడ్రస్ తెలియక దారి తప్పి ఉదయం 10.40 గంటలకు మహేశ్వరం ఠాణాకు చేరుకుంది. పరీక్ష కేంద్రం కందుకూరు మండలం కొత్తూరు సమీపంలో ఉందని చెప్పడంతో ఆందోళనకు గురైంది. గమనించిన మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు వెంటనే విద్యార్థితో పాటు ఆమె తల్లిని పోలీస్ పెట్రోల్ మొబైల్ వాహనంలోఎస్ఆర్ఐ కళాశాల పరీక్ష కేంద్రంలో 10.55 గంటలకు వదిలిపెట్టారు. విద్యార్థిని సమయానికి పరీక్ష కేంద్రంలోకి వెళ్లి పరీక్ష రాయడంతో పోలీసులు చేసిన పనికి నెటిజన్లు శభాష్ అంటున్నారు. పరీక్ష రాసిన అనంతరం విద్యార్థిని, ఆమె తల్లి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాత నేరస్తుడి రిమాండ్

మీర్‌పేట: బాలికపై దాడికి పాల్పడిన పాత నేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నాగరాజు తెలిపిన ప్రకారం లెనిన్‌నగర్‌కు చెందిన పన్నాల సురేష్, ముత్యాల గణేశ్ తాపీ మేస్త్రీలుగా పనిచేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం పనిచేసే చోట ఇద్దరికి గొడవ జరిగింది. ఇది మనసులో పెట్టుకున్న గణేశ్.. శనివారం సాయంత్రం దాడి చేసేందుకు నేరుగా సురేష్ ఇంటికి వెళ్లాడు. అతను లేకపోవడంతో అతడి కూతురు(16) కంట్లో కారం చల్లి, కత్తెరతో దాడి చేసి గాయపరిచాడు. సురేష్ ఫిర్యాదు మేరకు గణేశ్‌ను రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. నిందితుడిపై వనపర్తిటౌన్, గద్వాలటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 19 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

ఏఐ విద్య





విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు ఏఐ సహకారం అవసరమని గుర్తించిన విద్యాశాఖ కృతిమ మేధస్సుతో బోధనకు కసరత్తు చేస్తోంది. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన జిల్లాలోని ఆరు పాఠశాలల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.

వికారాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను పరిచయం చేయాలని విద్యాశాఖ యోచిస్తోంది. విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృతిమ మేధస్సు సహకారం సైతం తీసుకోవాలని నిర్ణయించి ఇందుకు తగిన కసరత్తు ప్రారంభించారు. తొలుత ప్రాథమిక పాఠశాలల్లో ఏఐని ప్రారంభించాలని భావిస్తున్నారు. ఈ మేరకు విద్యాశాఖ సెక్రెటరీ యోగితారాణా శుక్రవారం డీఈఓ, కలెక్టర్లతో జూమ్ మీటింగ్ నిర్వహించి తరగతి గదిలో పరిచయంపై దిశా నిర్దేశం చేశారు. ఆధార్ సాఫ్ట్‌వేర్ తయారీలో కీలక భూమి పోషించిన ఎక్ స్టెప్ ఫౌండేషన్ వారు శనివారం జూమ్ మీటింగ్‌లో డీఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు బోధనలో కృతిమ మేధస్సుపై అవగాహన కల్పించారు.

సర్కార్ శ్రమ ఫలించేనా..?

గతంలో ప్రాథమిక విద్యలో ఎన్నో ప్రయోగాత్మక కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేయగా అవేవి ఆశించిన స్థాయిలో ఫలితాలనివ్వలేదు. పాఠశాల విద్యలో సామర్థ్యాల పెంపునకు అపెప్, డిపెప్, క్లిప్, క్లాప్, క్యూఐపీ, ఎల్ఈపీ, ట్రిపుల్ ఆర్ తదితర కార్యక్రమాలను విద్యాశాఖ అమలు చేసింది. ప్రస్తుతం అన్ని రంగాల్లో ఏఐ ప్రధానమైన నేపథ్యంలో సర్కార్ బడుల్లో ఈ విధానం ప్రవేశపెట్టి విద్యా ప్రమాణాలు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇది సత్ఫలితాలు ఇస్తుందా..? ఆచరణలో చతికిల పడుతుందా అనేది వేచి చూడాలి.

పైలెట్ ప్రాజెక్టులో జిల్లా

ప్రాథమిక పాఠశాల స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను పరిచయం చేయాలని చూస్తున్న ప్రభుత్వం ముందుగా ఐదు జిల్లా(వికారాబాద్, మెదక్, నారాయణపేట్, ఖమ్మం, మేడ్చెల్)లను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ మేరకు వారం రోజుల క్రితం బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న ఎక్ స్టెప్ ఫౌండేషన్ నిర్వహించిన రెండు రోజుల అవగాహన సదస్సుకు హాజరయ్యారు. పాఠశాల విద్యలో కృత్రిమ మేధస్సు ప్రవేశంతో లాభ-నష్టాలు, తరగతి గదిలో చేయాల్సిన ఏర్పాట్లు, కల్పించాల్సిన సదుపాయాలు తదితర అంశాలు చర్చించారు. ఈ సమావేశానికి రాష్ట్రం నుంచి ఇద్దరు డీఈఓలు(నిజామాబాద్, వికారాబాద్) హాజరయ్యారు. ఎక్ స్టెప్ ఫౌండేషన్ వారు ఇప్పటికే కర్ణాటక రాష్ట్రంలోని పాఠశాల విద్యలో ఏఐని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు.

పైలెట్ ప్రాజెక్ట్ పాఠశాలలు

మండలం	ప్రాథమిక పాఠశాల
దోమ	బొంపల్లి
పరిగి	గడిసింగాపూర్
తాండూరు	సాయిపూర్
కొడంగల్	కొడంగల్
కోట్‌పల్లి	ఎన్నారం
వికారాబాద్	పులిమద్ది

ల్యాబ్‌లు అందుబాటులో ఉన్న ఆరు పాఠశాలల ఎంపిక

ఏఐని ప్రవేశపెట్టడానికి తగిన వాతావరణం ఉన్న పాఠశాలలను ముందుగా ఎంపిక చేసి పరిచయం చేయాలని నిర్ణయించారు. ఇందుకు కంప్యూటర్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్న ఆరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు.

అందరి సహకారం అవసరం



విద్యలో ఏఐ అమలుకు రాష్ట్ర విద్యాశాఖ, కలెక్టర్ ఎంతో ప్రాధన్యత ఇస్తున్నారు. అందరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవతం చేసేందుకు కృషి చేస్తాం. విద్యార్థులు చదవడం, రాయడం నేర్పిస్తారు. రాసేప్పుడు వారి చెవులకు ఇయర్ ఫోన్లు అమరుస్తారు. ఇందుకు ముందుగానే కంప్యూటర్లలో పొందుపరిచిన సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానం చేస్తారు. కృత్రిమ మేధస్సు సహకారంతో విద్యార్థులు చదవడం, రాయడం విధానంలో పొరపాట్లను ముందిపు చేసి విద్యార్థులకు వివరిస్తుంది. విద్యార్థుల సామర్థ్యాల మదింపు, మూల్యాంకణం చేసి మరుసటి రోజు లేక కొద్ది రోజుల తర్వాత ఉపాధ్యాయులు చెప్పే అంశాలను ఏఐ వెంటనే వారికి చెబుతుంది. దీంతో వారు మళ్లీ ఆ తప్పు చేయకుండా ముందుకు వెళ్లటానికి వీలవుతుంది.

– రేణుకా దేవి, డీఈఓ, వికారాబాద్

బాలికల కబడ్డీ చాంపియన్‌గా భద్రాద్రి

- బాలుర విభాగంలో నల్లగొండ
- బాలికల విభాగంలో రన్నరప్‌గా రంగారెడ్డి, బాలుర విభాగంలో నాగర్‌కర్నూల్ జట్లు

అనంతగిరి: క్రీడల్లో గెలుపోటములు సహజమని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. వికారాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న 34వ సబ్ జూనియర్ అంతర్రాష్ట్ర బాలబాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని చెప్పారు. క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యతినిస్తోందని.. జాతీయ అంతర్జాతీయ పోటీల్లోనూ రాణించి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాపోటీలను విజయవంతంగా చేపట్టిన నిర్వాహకులను అభినందించారు. రాత్రి నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో బాలికల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు, బాలుర విభాగంలో నల్లగొండ జట్టు విజయం సాధించగా.. రన్నరప్‌గా బాలికల విభాగంలో రంగారెడ్డి, బాలుర విభాగంలో నాగర్‌కర్నూల్ జిల్లా జట్లు నిలిచాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరుశురాం నాయక్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఆనంద్, కోశాధికారి నరేందర్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, పీడీలు, పీఈటీలు, నాయకులు పాల్గొన్నారు.



బాలికల కబడ్డీ పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచిన రంగారెడ్డి జట్టుకు బహుమతి అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్, చిత్రంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

అప్పుల బాధతో కుటుంబం అదృశ్యం?



అదృశ్యమైన కుటుంబం (ఫైల్)

శంషాబాద్: అప్పుల బాధ భరించలేక కుటుంబంతో సహా ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెల్పిన మేరకు..మొయినాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన డి.సుదర్శన్ వివాహనం అనంతరం అత్తగారిల్లు ఉన్న కర్మన్‌ఘాట్‌లో ఏడేళ్లు, ఆ తర్వాత శంషాబాద్ పట్టణంలో ఏడాది కాలం నివసించాడు. రెండు చోట్లా అప్పులు కావడంతో గత మూడేళ్లుగా నర్కూడ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల చీటీ డబ్బుల వసూలు కోసం ప్రభాకర్ అనే వ్యక్తి సుదర్శన్ ఇంటికి వెళ్లగా వారు ఇంట్లో కన్పించకపోవడంతో వారి తల్లికి విషయం తెలిపాడు. ఈ విషయమైన సుదర్శన్ సోదరుడు భానుప్రకాష్ అద్దె ఇంట్లో ఆరా తీయగా సుదర్శన్‌తో పాటు ఆయన భార్య తేజస్వి, ఇద్దరు కుమారులు ఇక్కడ ఉండడం లేదని వెల్లడైంది. ఈ నెల 18 నుంచి వారు ఇంట్లో లేరని తెలియడంతో భానుప్రకాష్ వారి కోసం అన్ని చోట్లా ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. అప్పుల ఒత్తిడి కారణంగానే ఎక్కడికైనా వెళ్లి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. భానుప్రకాష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘ఉపాధి’కి ఇబ్బంది

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- 33 గ్రామాలకు 11 మందే ఫీల్డ్ అసిస్టెంట్లు
- ఉపాధి హామీ పనులపై కొరవడిన పర్యవేక్షణ
- పనిభారంతో ఇబ్బంది పడుతున్న పంచాయతీ కార్యదర్శులు
- నేటికీ నూతన గ్రామాలకు కేటాయించని ఎఫ్ఏలు



దౌల్తాబాద్: గ్రామాల్లో వలసలను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా పనుల పర్యవేక్షణ ఇతరతర పనుల నిమిత్తం గ్రామానికి ఒక ఫీల్డ్‌అసిస్టెంట్ నియమించింది. మండల పరిధిలో మొత్తం 33 గ్రామ పంచాయతీలకుగాను కేవలం 11 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ కూలీలకు సరైన పనిదినాలు కల్పించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఫీల్డ్‌అసిస్టెంట్లు లేక ఆ భారం గ్రామకార్యదర్శులపై పడడంతో వారు ఒత్తిడికి గురవుతున్నారు.

సీనియర్ మేట్లతో పనులు

గతంలో 20 పంచాయతీలుండేవి. తర్వాత కొత్తగా 15 పంచాయతీలు ఏర్పాడ్డాయి. ఇందులో రెండు పంచాయతీలు దుద్యాల మండలంలో కలిశాయి. ఇప్పుడు 33 పంచాయతీలున్నాయి. కొత్త గ్రామాలు ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయినా నేటి వరకు ఎఫ్ఏలను నియమించలేదు. మేజర్ గ్రామపంచాయతీ అయిన మండల కేంద్రంలోనే ఎఫ్ఏ లేరు. దేవర్‌ఫసల్‌వాద్ ఎఫ్ఏ రాజీనామా చేశారు. గుండేపల్లి ఎఫ్ఏ మృతి చెందారు. దీంతో ఆయా గ్రామాల్లో సీనియర్ మేట్లతోనే పనులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నూతన జీపీలకు ఖాళీగా ఉన్న గ్రామాలకు ఎఫ్ఏలను నియమించి సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల కూలీలు కోరుతున్నారు.

ఆదేశాలు వస్తే ఖాళీల భర్తీ

33 పంచాయతీలకు గాను 11మంది ఎఫ్ఏలు ఉన్నారు. 22 గ్రామాలకు వేర్వేరు కారణాలతో ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో సీనియర్ మేట్ల సహాయంతో పనులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే ఖాళీలు భర్తీ చేస్తాం.

– రజినికాంత్, ఏపీఓ, దౌల్తాబాద్



కొహెడలో మార్కెట్ నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సురేంద్రమోహన్



బాటసింగారం మార్కెట్‌లో రైతులు, వ్యాపారులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న సురేంద్రమోహన్

అంతర్జాతీయ ప్రమాణాలతో కొహెడ మార్కెట్

- త్వరలో పరిపాలనా అనుమతులు
- వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్

అబ్దుల్లాపూర్‌మెట్/తుర్కయంజాల్: కొహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ నిర్మాణం చేపడతామని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్ర మోహన్ తెలిపారు. త్వరలోనే పరిపాలన అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అదనపు సంచాలకుడు లక్ష్మణుడు, జాయింట్ డైరెక్టర్ మల్లేశం, జిల్లా మార్కెటింగ్ రిజిస్టర్ రియాజ్, కొహెడ మార్కెట్ కన్సల్టెంట్ ఉమామహేశ్వర రావుతో కలిసి ఆదివారం ఆయన కొహెడలో పండ్ల మార్కెట్ నిర్మాణం కోసం కేటాయించిన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసియా ఖండంలోనే అత్యున్నత స్థాయి సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. త్వరలో సీఎంతో పాటు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి మార్కెట్ నిర్మాణానికి పాలనా అనుమతులు మంజూరు చేయడంతో పాటు పనులకు శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

200 ఎకరాల్లో రూ.2,900 కోట్లతో..

కొహెడ మార్కెట్లో పండ్లు, పాలు, డ్రై ఫ్రూట్స్, మాంసాహార ఉత్పత్తులతో పాటు పూల వంటి ఉత్పత్తులకు అవకాశం ఉందని సురేంద్రమోహన్ అన్నారు. దాదాపు 200 ఎకరాల్లో రూ.2,900 కోట్లతో మార్కెట్ నిర్మాణం జరుగనుందని చెప్పారు. మార్కెట్‌కి వచ్చే రైతులు, వినియోగదారులు, అమ్ముకునే వర్తకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యున్నత సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉత్పత్తులను నిల్వ ఉంచేందుకు అత్యాధునిక కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం బాటసింగారం పండ్ల మార్కెట్‌లో క్రయవిక్రయాలను పరిశీలించారు. ఏపీ ప్రాంతాల నుంచి పండ్లు దిగుమతి అవుతున్నాయి.. ఏపీ ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయన్న విషయాలను వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, మార్కెట్ సెక్రటరీ ఎల్.శ్రీనివాస్, డైరెక్టర్లు బండి మధుసూదన్ రావు, రఘుపతి రెడ్డి, నరసింహ, జైపాల్ రెడ్డి, మచ్చేందర్ రెడ్డి, గణేశ్ నాయక్, వెంకటేశం గుప్తాం, ఇబ్రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బులు కట్టాం.. ఇళ్లు అప్పగించండి

లబ్ధిదారుల ఆందోళన




సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

హుడాకాంప్లెక్స్: పేద, బడుగు బలహీన వర్గాల కోసం నిర్మించిన ఇళ్లను వెంటనే అసలైన లబ్ధిదారులకు అప్పగించాలంటూ సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. హస్తినాపురం నందనవనం జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద 15 ఏళ్ల క్రితం 512 నివాసాలను అప్పటి ప్రభుత్వం నిర్మించింది. వాటిలో 427 ఇళ్లను స్థానిక నిరుపేదలు ఆక్రమించుకుని కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. తర్వాత ప్రభుత్వం ఆ గృహాలకు సంబంధించిన లబ్ధిదులను ఎంపిక చేసి కేటాయింపు పత్రాలు అందజేసింది. వారు ఇక్కడికి వచ్చి చూడగా ఆ నివాసాల్లో వేరే వాళ్లు ఉంటున్నారని, ఖాళీ చేయబోమని చెప్పారని లబ్ధిదారులు అధికారులకు తెలియజేశారు. ఇళ్లలో ఉంటున్న వారికి, అధికారులు ఎంపిక చేసిన లబ్ధిదారులకు మూడేళ్లుగా ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. న్యాయం చేయాలంటూ ఇరువర్గాలు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. సమస్యను పరిశీలించిన ప్రభుత్వం ప్రస్తుతం ఆ నివాసాల్లో ఉంటున్న పేదలకు డ్రా పద్ధతిలో నగరంలోని ఇతర ప్రాంతాల్లో నిర్మించిన ఇళ్లను కేటాయించాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా 15 నవంబర్ 2022న ఆర్డీఓ వెంకటాచారి, హౌసింగ్ బోర్డు ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో డ్రా పద్ధతిలో 427 కుటుంబాలకు ఇతర ప్రాంతాల్లో నివాసాలు కేటాయించారు. అయినా ఈ వారు నందనవనంలోని ఇళ్లు ఖాళీ చేయకుండానే కొత్తగా కేటాయించిన ఇళ్లను సైతం ఆక్రమించి నివాసం ఉంటున్నారు. 2006లో ఇళ్ల కోసం ప్రభుత్వానికి రూ.80,250 చొప్పున చెల్లించిన వారు విసిగిపోయి ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా అక్రమంగా నివాసముంటున్న వారిని ఖాళీ చేయించి డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

నిద్రావస్థలో నిఘానేత్రం!

- మైతాప్‌ఖాన్‌గూడలో పనిచేయని సీసీ కెమెరాలు
- జిల్లాల సరిహద్దులోనే నిఘా కరువు
- పట్టించుకోని అధికారులు



ప్రధాన చౌరస్తాలో పని చేయని సీసీ కెమెరా

నవాబుపేట: నేరాల అదుపులో కీలక పాత్ర పోషిస్తున్న సీసీ కెమెరాలు అక్కడక్కడ పనిచేయడం లేదు. పోలీస్ వ్యవస్థలో మూడో కన్నుగా పిలువబడుతున్న సీసీ కెమెరాలు మైతాప్‌ఖాన్‌గూడలో నిఘా కరువైంది, అవీ పనిచేయడం లేదు. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు దాదాపు రెండేళ్లుగా అలానే ఉన్నాయి. ఈ విషయంలో గ్రామ పంచాయతీ అధికారులు, గానీ ఇతర పోలీస్ అధికారులు గానీ కన్నెత్తి చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

మూడు జిల్లాల సరిహద్దు..

మండల పరిధిలోని మైతాప్‌ఖాన్‌గూడా గ్రామం మూడు జిల్లాలకు సరిహద్దుగా ఉంది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి ఈ మూడు జిల్లాల సరిహద్దు గ్రామంగా ఉంది. మూడు జిల్లాలకు వెళ్లాలంటే ఈ ప్రధాన చౌరస్తా నుంచే వెళ్లాలి. ఇక్కడ ఎప్పుడు కూడా ప్రయాణికులతో సందడిగా ఉంటుంది. ముఖ్యంగా సంగారెడ్డి నుంచి అక్రమ ఇసుక రవాణా వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సరఫరా చేస్తుంటారు. నవాబుపేట మండలం నుంచి అక్రమంగా కలపను శంకర్‌పల్లి, సంగారెడ్డికి తరలిస్తుంటారు. గ్రామంలో వైన్స్‌సైతం లభిస్తుండడంతో గ్రామం మరింత బిజీగా మారింది. నిత్యం మూడు జిల్లాల ప్రజలు ఇక్కడి నుంచి రాకపోకలు చేస్తుంటారు. అలాంటి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు దాదాపు రెండేళ్ల నుంచి పని చేయడంలేదంటే ఆశ్చర్యం వేయక మానదు. ఇప్పటికైన ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి సీసీ కెమెరాలను బాగు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

గిరిజాపూర్ గ్రామాభివృద్ధికి చర్యలు

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గిరిజాపూర్ నాయకులు

యాలాల: గిరిజాపూర్ గ్రామాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు హన్మంత్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు ఆదివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఊరచెరువు కట్ట అభివృద్ధి, పానాది బాట, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు వేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. బోరు మోటారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ నాయకులు బోనస్ వెంకట్, సురేష్, శ్రీనివాస్, వెంకటేశ్, వెంకటప్ప, కిష్టప్ప, రాములు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



శివరాం నాయక్ దంపతులను సన్మానిస్తున్న భీంరెడ్డి తదితరులు

కుల్కచర్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పటేల్‌చెరువు తండా పంచాయతీలో పల్లెగడ్డ మైసమ్మ తల్లి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు హాజరైన భీంరెడ్డి మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి పాటుపడిన శివరాంనాయక్ దంపతుల కృషిని అభినందించారు. ప్రతీ ఒక్కరు భక్తి భావం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, నాయకులు నరసింహ నాయక్, నర్సింలు యాదవ్, చంద్రభూపాల్, రవి, చంద్రయ్య, భారతమ్మ, రాంచంద్రయ్య, చంద్రయ్య, అనంతయ్య, సోమలింగం, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

శంషాబాద్: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. వనపర్తికి చెందిన మణెమ్మ, భాస్కర్ దంపతులు నగరానికి వలసవచ్చి ఊట్‌పల్లిలో గుడిసె వేసుకుని నివాసం ఉంటున్నారు. ఈ నెల 1న భాస్కర్ ప్లాస్టిక్ సామన్లు విక్రయించేందుకు సంగారెడ్డి వెళ్లి మర్నాడు తిరిగి వచ్చాడు. మణెమ్మ(30) ఇంట్లో లేకపోవడంతో పరిసరాల్లో ఆరా తీయడంతో ఆదే రోజు బయటికి వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. దీంతో అతను ఆదివారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రాజేంద్రనగర్: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి రూ.3 నగదు ఎత్తుకెళ్లిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... కిస్మత్‌పూర్ గ్రామానికి చెందిన మెరుగు జంగయ్య గౌడ్ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఓ యువకుడుఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు. అల్మారా తెరిచిన శబ్దం విన్న పక్కింటి మహిళ అక్కడికి రాగా సదరు యువకుడు ఆమెను పక్కకు తోసి బయటికి పరిగెత్తాడు. ఈ దృశ్యాన్ని పక్కనే ఉన్న మేడపై ఉన్న మరో మహిళ తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేసింది. దీనిపై సమాచారం అందుకున్న జంగయ్య కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి పరిశీలించగా రూ. 3 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముక్తి కోసం.. భక్తి పూజలు



ఆలయంలో అమ్మవారి దర్శనానికి భక్తుల బారులు



కిక్కిరిసిన భక్త జనం

- ఎల్లమ్మ తల్లి దర్శనానికి బారులు తీరిన భక్తులు
- నేడు ముగియనున్న ఉత్సవాలు

బొంరాస్‌పేట: పోలేపల్లి జాతర భక్తులతో కిటకిటలాడుతోంది. ఆదివారం అమ్మవారికి బోనమెత్తి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సూర్యోదయం మొదలు భక్తులు కోనేటిలో స్నానమాచరించి ఆయలం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చేతిలో కోడిపుంజులు, కొబ్బరికాయలతో భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ జయరాములు, ఈఓ రాజేందర్‌రెడ్డి, రేణుక ఎల్లమ్మ యువజన సంఘం అధ్యక్షుడు బుగ్గప్ప, మాజీ చైర్మన్లు ముచ్చటి వెంకటేశ్, రామకృష్ణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటయ్యగౌడ్, నర్సింలు ముదిరాజ్, నర్సింలు, లక్ష్మి, రాములు, మునికుమార్, యాదయ్య జాతర ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

నేడు ఉత్సవ విగ్రహం ఊరేగింపు

నాలుగు రోజులుగా కొనసాగుతున్న జాతర సోమవారంతో ముగియనుంది. రోజంతా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం హుండీ లెక్కింపు ప్రారంభిస్తారు. అనంతరం సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భారీ ఊరేగిపు నడుమ పల్లకీ సేవతో ఆలయం నుంచి గ్రామంలోని ఆలయానికి చేర్చుతారు.

రూ.1.5 కోట్లతో సీసీ రోడ్డు పనులు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలో ఎస్‌ఆర్ ఈజీఎస్, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.1.5 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో పెద్ద ఎత్తున నిధులు మంజూరైనట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ అంజయ్య, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్, శివానందం, నక్కల బందెయ్య, చిత్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

అమీర్‌పేట: ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైతలాపూర్‌కు చెందిన రోజా ఉద్యోగావకాశాల పేరిట వచ్చిన ప్రకటన చూసి మూసాపేటలోని ఎర్త్ సెక్యూరిటీ కాంట్రాక్ట్ మ్యాన్ పవర్ సర్వీసెస్ కార్యాలయాన్ని సంప్రదించింది. ఏజెన్సీ నిర్వాహకుడు మాడుగుల సురేష్‌ను కలవగా ఉద్యోగం ఇప్పిస్తానని రూ.40 వేలు తీసుకున్నాడు. కేపీహెచ్‌బీ కాలనీలోని బస్తీ దవాఖానలో కాంట్రాక్ట్ పద్ధతిన కేవలం ఒక సంవత్సరం పాటు ఉద్యోగంలో చేర్పించాడు. గడువు తీరిన తర్వాత రూ.లక్ష రూపాయలు చెల్లిస్తే స్టాఫ్ నర్సుగా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో అమీర్‌పేట అన్నపూర్ణ బ్లాక్‌లోని మరో కార్యాలయం ద్వారా రూ.80 వేలు చెల్లించింది. స్టాఫ్ నర్సు ఉద్యోగం కోసం అమీర్‌పేటలోని కార్యాలయానికి వెళ్లగా అప్పటికే కార్యాలయం మూసి ఉంది. నిర్వాహకుడు సురేష్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కుల్కచర్ల: చికిత్సపొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన కుల్కచర్ల పోలిస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 16వ తేదీ సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటనలో తలకు గాయాలైన సత్యయ్య అనే వ్యక్తిని మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు.

వ్యక్తి బలవన్మరణం



గోరేసాబ్ మృతదేహం

తాండూరు రూరల్: కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కరన్‌కోట్‌లో ఆదివారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గోరేసాబ్(35) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పెద్దల నుంచి వచ్చిన ఆస్తిలో తనకు వాటా ఇవ్వాలని తండ్రి హుసేన్‌సాబ్‌ను తరచూ కోరేవాడు. పని చేసుకుని బతకాలని తండ్రి సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో తాండూరులోని ఓ పాలిషింగ్ యూనిట్‌లో కూలీ పనులకు వచ్చి మధ్యాహ్నం ఇంటికి వెళ్లాడు. ఇంట్లోని దూలానికి నైలాన్‌తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫరీదాబేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్‌ఐ చెప్పారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్న నలుగురిని శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేసి ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో శనివారం రాత్రి గంజాయిని విక్రయిస్తున్న ముచ్చింత్, పెద్దతూప్ర గ్రామాలకు చెందిన బొడ్డు భాను, బ్యాగరి కిరణ్‌తో పాటు మైనర్ బాలుడు పట్టుబడ్డాడు. వీరి నుంచి 56 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా ఎయిర్‌పోర్టు బావర్చి హోటల్ సమీపంలో గంజాయి విక్రయించేందుకు వచ్చిన సఫీల్‌గూడ చెందిన ఆర్.రోహిత్‌ను పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 100 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కాదేదీ కల్తీకనర్హం..

కల్తీ పదార్థాల తయారీకి జల్‌పల్లి పుట్టినిల్లుగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి కేటుగాళ్ల దందా జోరుగా సాగుతోంది. కాదేదీ కల్తీకనర్హం అన్నట్లుగా.. సీసం బట్టీలు, ప్లాస్టిక్ రీసైక్లింగ్, చాక్లెట్, బిస్కట్, కుర్‌కురే కంపెనీలు, భారీగా బీఫ్ కోల్డ్ స్టోరేజీలు, ఎముకల నుంచి నూనే, డాల్డా తయారు చేసి ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఔషధాల కల్తీకి సాహసం చేశారు.

జల్‌పల్లి కేంద్రంగా దందా

- రెచ్చిపోతున్న కేటుగాళ్లు
- జోరుగా కల్తీ పదార్థాల తయారీ
- ఔషధాలను వదలని వైనం
- గుర్తింపులేని యునాని ఆస్పత్రి సీజ్



నకిలీ యునాని మెడిసిన్ తయారీ గోడౌన్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో అక్రమ దందాలు మితిమీరిపోతున్నాయి. కొందరు అక్రమార్కులు.. కల్తీ ఆహార పదార్థాలు తయారు చేస్తూ ప్రజారోగ్యానికి పాటుపడుతున్నారు. శ్రీరాంకాలనీ పారిశ్రామిక వాడలో చిన్నారులు తినే చాక్లెట్లు మొదలు వంట నూనె వరకు నాసిరకం విక్రయిస్తూ రూ.లక్షలు కోట్లు కూడబెట్టుకుంటున్నారు. తాజాగా నకిలీ ఆస్పత్రి బాగోతం వెలుగుచూసింది.

గుండె జబ్బులు నయం చేస్తామంటూ..

యునానీ వైద్యం పేరిట ప్రజల ఆరోగ్యంతో అతవుల్లా అనే వ్యక్తి ఆడుకుంటున్నాడు. ఎలాంటి అనుమతులు లేకుండా అద్నాన్ కాలనీలో భారీ షెడ్డు నిర్మించారు. అందులో ఆయుర్వేదిక్, యునాని ఔషధాలు తయారు చేస్తున్నాడు. కనీసం మెడికల్ డిగ్రీ కూడా లేకుండా కేన్సర్, కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులను నయం చేస్తామంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారం చేస్తున్నారు. ఇది నమ్మిన ప్రజలు, ఇక్కడ వైద్యం చేయించుకునేందుకు మక్కువ చూపుతున్నారు. నిత్యం 200- 250 మంది వ్యాధిగ్రస్తులు రూ.4,5 వేలు వెచ్చించి మెడిసిన్ కొనుగోలు చేస్తున్నారు.

పర్యవేక్షణ కొరవడి..

మున్సిపాలిటీ వెనుక భాగంలోని అద్నాన్, శ్రీరాం కాలనీ పారిశ్రామిక వాడలు గ్రామానికి ఒక వైపుగా ఉండడంతో కేటుగాళ్లు చెలరేగుతున్నారు. వారి ఆగడాలకు చెక్ పెట్టే నాథుడే లేక కల్తీ వ్యాపారం విస్తరిస్తున్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాల్సిన మున్సిపాలిటీ, పోలీస్, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కల్తీ వ్యాపారం 'మూడు పువ్వులు, ఆరు కాయలు'అన్న చందంగా సాగుతోంది. ఇలాంటి కల్తీ పదార్థాల కంపెనీలతో ఈ ప్రాంతంలో వాయు కాలుష్యం సైతం మోతాదును మించడంతో ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని, ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి ముప్పు తెస్తున్న ఇలాంటి కంపెనీల భరతం పట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం మందనంతాపూర్ గేటు వద్ద రూ.48 కోట్లతో తాండూరు–వికారాబాద్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో మాట్లాడి తాండూరు–వికారాబాద్ రోడ్డుకు నిధులు మంజూరు చేయించానన్నారు. నన్ను గెలిపించిన తాండూరు ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. దశలవారీగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ అంజయ్య, నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు శోభరాణి, నాయకులు మహిపాల్‌రెడ్డి, జీతేందర్‌రెడ్డి, నసీర్, డీవై నర్సిములు, కొహిర్ రవి, లొంక నర్సిములు, ఎల్లారెడ్డి, మల్లేశం, కుమార్‌సేట్, గోపాల్‌రెడ్డి, మైపూఫ్‌లు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ధర్మ పరిరక్షణకు పాటుపడదాం

సనాతన ధర్మసేనా వ్యవస్థాపకుడు డాక్టర్ రాజశేఖర్



సినిమాకు వచ్చిన యువకులతో డాక్టర్ రాజశేఖర్

అనంతగిరి: ప్రతిఒక్కరూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని సనాతన ధర్మసేనా వ్యవస్థాపకుడు డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. సనాతన ధర్మసేనా ఆధ్వర్యంలో ఆదివారం వికారాబాద్‌లోని శైలజ థియేటర్‌లో చావా సినిమాను సుమారు 200మందితో ఆయన తిలకించారు. ఈ సందర్భంగా సినిమాకు వచ్చిన యువకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ధర్మసేనా ప్రతినిధులు, పలువురు నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి తరలిస్తున్న టిప్పర్ లారీల పట్టివేత



అనంతగిరి: సీజ్ చేసిన జేసీబీ



పరిగి: పట్టుకున్న జేసీబీ

అనంతగిరి: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మోమిన్‌పేట, నవాబ్‌పేట పీఎస్ పరిధిలో అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, మూడు టిప్పర్ లారీలను, రెండు జేసీబీలను సీజ్ చేసి, ఆయా పీఎస్‌లలో కేసు నమోదు చేశారని జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. మోమిన్‌పేట పీఎస్ పరిధిలోని దేవరాంపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో మూడు ట్రాక్టర్లు, ఒక జేసీబీ సీజ్ చేసి మోమిన్‌పేట పీఎస్‌లో కేసు నమోదు చేశారు. నవాబ్‌పేట మండల పరిధిలోని అర్కతల గ్రామ శివారులో ఎర్రమట్టి తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు దాడులు చేసి మూడు టిప్పర్లు, ఒక జేసీబీని సీజ్ చేసి పీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పరిగిలో..

పరిగి: అక్రమంగా అటవీ ప్రాంతంలో మట్టి తవ్వుతున్న జేసీబీని అటవీశాఖ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. నజీరాబాద్ తండాలోని అటవీప్రాంతంలో అక్రమంగా మట్టి తవ్వుతున్నారనే సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి జేసీబీని పట్టుకుని సీజ్ చేశారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఉన్నత అధికారుల సూచనల మేరకు కేసు నమోదు చేశామని, సంబంధిత నివేదిక పత్రాలను అధికారులకు అందించామని పరిగి ఎఫ్‌ఆర్‌ఓ ప్రతిమా తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

ప్రేమించి పెళ్లాడిన వ్యక్తే వేధించాడు..

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

ఉప్పల్: సరిగ్గా ఏడాది క్రితం ప్రేమికుల రోజున ఒక్కటైన జంట ఉదంతంలో విషాదం చోటుచేసుకుంది. కట్టుకున్నోడే వేధింపులకు గురిచేయడంతో తట్టుకోలేక యువతి ఆత్మహత్య చేసుకుంది. ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనపై ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు..సూర్యాపేట జిల్లా మద్దిరాల గ్రామానికి చెందిన ఆకుల మనీషా(24), తుంగతుర్తి ప్రాంతానికి చెందిన పులిగుజ్జు సంపత్‌లు ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదివే సమయంలో ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు వేర్వేరు కావడంతో మనీషా తల్లిదండ్రులను ఎదురించి సంపత్‌ను గతేడాది వాలంటైన్స్ డే రోజున ఉప్పల్ ఆర్యసమాజ్‌లో పెళ్లాడింది. అనంతరం రామంతాపూర్‌లో కాపురం పెట్టారు. వీరి వైవాహిక జీవితం కొన్నాళ్లు బాగానే ఉన్నా అనుకోని విధంగా భర్త నుంచి వేధింపులు ప్రారంభమయ్యాయి. సంపత్‌కు వరుసకు సోదరి అయ్యే మున్నిత అనే యువతి కూడా కట్నం తేవాలని వేధించడంతో ఇటీవల మనీషా విషయాన్ని తల్లిదండ్రులకు మొరపెట్టుకుంది. దీంతో వారు భర్తను వదిలేసి ఇంటికి రావాలని సలహా ఇవ్వగా అందుకు ఒప్పుకోలేదు. చివరకు తీవ్ర ఒత్తిడికి గురై ఆదివారం రాత్రి తాను ఉంటున్న గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ అసుపత్రికి తరలించారు. మనీషా తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు భర్త సంపత్, మున్నితపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిగరెట్ అమ్మినా సీరియస్ యాక్షన్

మైనర్లకు విక్రయాలపై టీజీఏఎన్‌బీ నజర్

- నగర వ్యాప్తంగా నిఘా ఉంచిన బృందాలు
- ఇలా చిక్కిన వ్యాపారులపై ఠాణాల్లో కేసులు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) అధికారులు కేవలం మాదక ద్రవ్యాల క్రయవిక్రయాల పైనే కాదు...సిగరెట్ల అమ్మకంలో జరుగుతున్న చట్టం ఉల్లంఘనలపైనా దృష్టి పెడుతున్నారు. నగర వ్యాప్తంగా పలువురు వ్యాపారులు మైనర్లకు సిగరెట్లు అమ్ముతున్నారంటూ వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో డైరెక్టర్ సందీప్ శాండిల్య ప్రత్యేక నిఘా బృందాలను రంగంలోకి దింపారు. ఇవి శుక్రవారం పశ్చిమ మండలంలోని ఇద్దరు వ్యాపారులను పట్టుకుని, వారిపై స్థానిక ఠాణాల్లో కేసు నమోదు చేయించాయి.

మాదక ద్రవ్యాలకు ముందు సిగరెట్...

టీజీఏఎన్‌బీ అధికారులు గడిచిన కొన్నేళ్లుగా నగరంలో జరుగుతున్న మాదక ద్రవ్యాల దందాను అధ్యయనం చేస్తున్నారు. ప్రధానంగా కళాశాలలు, పాఠశాలలతో పాటు ఇతర విద్యా సంస్థలపై పటిష్ట నిఘా ఉంచారు. వాటిలో, సమీపంలో, సంబంధించిన టీజీఏఎన్‌బీకి చిక్కిన వారిలో గంజాయి తాగుతున్న వాళ్లే ఎక్కువగా ఉంటున్నారు. అతి తక్కువ మంది ఇతర మాదకద్రవ్యాలను బానిసలుగా మారారు. ఆయా విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్న టీజీఏఎన్‌బీ అధికారులు వాళ్లు ఈ వ్యసనానికి బానిసకావడానికి కారణాలను అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ కీలక విషయం అధికారులకు తెలిసింది. ఇతర మాదకద్రవ్యాలు వినియోగానికి ముందు వారంతా గంజాయి సేవించేవారని బయటపడింది. దీనికి ముందు సిగరెట్ కాల్చడంతో ఈ ఊబిలోకి దిగినట్లు పలువురు బయటపెట్టారు.

చట్టం స్పష్టంగా చెబుతున్నప్పటికీ..

తల్లిదండ్రులు, కుటుంబీకుల పర్యవేక్షణ లేకపోవడం, మెచ్యూరిటీ తక్కువగా ఉండటంతో పాటు వివిధ కారణాల నేపథ్యంలో మైనర్లు వ్యసనాలకు తేలిగ్గా ఆకర్షితులై, బానిసలుగా మారుతూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే జువైనల్ జస్టిస్ యాక్ట్ (జేజేఏ), సిగిరెట్ అండ్ అదర్ టుబాకో ప్రొడక్ట్ యాక్ట్ (కాట్పా) ప్రకారం మైనర్లకు మద్యం, సిగిరెట్లు, మాదకద్రవాలు తదితరాల విక్రయంపై నిషేధం ఉంది. అయితే మద్యం విక్రయాల విషయంలో నిబంధనలు కొంతవరకు అమలు అవుతున్నాయి. సిగరెట్ల విక్రయించకూడదనే విషయాన్ని మాత్రం ఎవరూ పట్టించుకోవట్లేదు. పోలీసులు సైతం అప్పుడప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు తప్ప మైనర్లకు విక్రయం విషయం పట్టించుకోవట్లేదు.